ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు

5

ఆదివారం 6 జూలై 2025

మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో...

- 104 మందికి జరిమానాలు
- నంద్యాల సబ్ డివిజన్‌లో స్పెషల్ డ్రైవ్



చెక్ చేస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్ జూలై 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సబ్ డివిజన్ వ్యాప్తంగా డ్రంకెన్ డ్రైవ్ విషయంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 104 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నంద్యాల సబ్ డివిజన్ అన్ని పోలీసు స్టేషన్లలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా ఇందులో కేవలం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో 60 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీరందరిని కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

మహిమాన్వితం దొర్నిపాడు క్షేత్రం 6

రిమాండ్ ఖైదీ మృతి

7 విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అఘాయిత్యం

డెంగీ.. డేంజర్ బెల్



- అప్రమత్తత లేకపోతే ప్రాణ నష్టం
- వాతావరణ మార్పులతో సీజన్ వ్యాధులు
- ఫ్రైడే డ్రైడే అమలు జరుగుతోందా?
- జిల్లాలో ప్రబలుతున్న విష జ్వరాలు

నంద్యాల హాస్పిటల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డెంగీ డేంజర్ బెల్ మోగింది. పరిసరాల అపరిశుభ్రత, ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇళ్ల చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండటం, మురుగునీటిపై దోమలు వ్యాప్తిచెందడంతో జ్వరాలు తీవ్రమవుతున్నాయి. ఇటీవల డోన్ పట్టణంలో అయిదుగురికి డెంగీ నిర్ధారణ కావడం కలకలం రేపింది. ఒకే ఇంట్లో ముగ్గురికి డెంగీ నిర్ధారణ కావడంతో ఆ కుటుంబం భయభ్రాంతులకు గురైంది. కర్నూలు జీజీహెచ్‌లో ఇద్దరు చికిత్స పొంది ఇళ్లకు వచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఫ్రైడే డ్రై డే సక్రమంగా అమలు అవుతున్నదా లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. శుక్రవారం పీహెచ్‌సీల పరిధిలో పరిసరాలు శుభ్రంగా ఉంచడం వైద్య సిబ్బంది బాధ్యత. ఇందులో భాగంగా ఫ్రై డే డ్రై డే అనే కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా నిర్వహించాల్సి ఉంది. కొన్ని పీహెచ్‌సీల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించడం లేదని తెలుస్తోంది. అంతే కాకుండా వాతావరణంలో మార్పుల కారణంగా ప్రస్తుతం సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం ఉంది. శివారు కాలనీల్లో జ్వరాలు ప్రబలుతున్నట్లు తెలుస్తోంది. డెంగీ సోకితే ప్రాణానికే ప్రమాదమని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. పగటిపూట కుట్టే ఆడ ఎడిస్ ఈజిప్ట్ దోమకాటుతో డెంగీ వైరస్ వ్యాప్తి చెందుతుంది. రెండు, మూడు రోజులు జ్వరంతో బాధపడుతున్న వ్యక్తులు వెంటనే వైద్యులను సంప్రదించాలి.

లక్షణాలిలా: తీవ్రమైన జ్వరం, రెండు కళ్ల నొప్పిగా ఉండటం, కీళ్ల, ఒంటినొప్పులు, శరీరంపై దద్దుర్లు రావడం, తలనొప్పి తీవ్రంగా ఉండటం, ఆకలి తగ్గిపోవడం వంటి లక్షణాలు డెంగీలో కనిపిస్తాయి. శరీర ఉష్ణోగ్రత అమాంతంగా 104డిగ్రీలకు చేరుకుంటుంది. ఈ లక్షణాలున్న వారు వెంటనే వైద్యులను సంప్రదిస్తే నివారించే అవకాశం ఉంటుంది.

నివారణకు తీసుకోవాలల్సిన జాగ్రత్తలు

డెంగీ జ్వరం రాకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు పాటిస్తే వైరస్ బారిన పడకుండా ఉండవచ్చు. ఇంటి చుట్టుపక్కల మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ముఖ్యంగా ఈ దోమ నీళ్లలో గుడ్లు పెడుతుంది. తలుపులు, కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి.

ర్యాపిడ్ కిట్లు అందుబాటులో ఉన్నాయి



డెంగీ జ్వరం నిర్ధారణకు ర్యాపిడ్ కిట్లు సమృద్ధిగా ఉన్నాయి. ముందుగా ఎన్‌ఎస్‌ఐ యాంటిజెంట్ పరీక్ష, ఎలీసా పరీక్ష చేయించుకుంటే డెంగీ వైరస్ నిర్ధారణ చేయవచ్చు. ఈ పరీక్షలకు సంబంధించి ర్యాపిడ్ టెస్ట్ కిట్లు ప్రతి పీహెచ్‌సీలో ఉన్నాయి. జిల్లాలోని ఆయా మున్సిపల్ కమిషనర్లకు డ్రైన్లలో నీరు నిల్వ ఉండకుండా ఇళ్ల పరిసరాల్లో శుభ్రంగా ఉండేలా సిబ్బందిని ఆదేశించాలని కోరాం. అంతేకాకుండా ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉన్న యజమానులకు నోటీసులు ఇవ్వాలి. డోన్ పట్టణంలో డెంగీ నివారణకు ఇళ్లలో పిచికారి చేయించాం. ఫ్రై డే డ్రై డేను అమలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం.



- డా.ఆర్. వెంకటరమణ, డీఎంహెచ్‌వో

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): పురోగతిలో వెనుకబడిన గ్రామాలను గుర్తించి అభివృద్ధి సాధించేందుకు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి సూచించారు. కర్నూలు నగరంలోని జడ్పీ ఆవరణలోని పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్‌సీ)లో శనివారం ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఒక్కరోజు శిక్షణ ఏర్పాటు చేశారు. శిక్షణలో పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్, గ్రామస్థాయిలోని సామాజిక, ఆర్థిక ప్రగతిని తెలియజేసే సూచికల గురించి క్లుప్తంగా వివరించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సంబంధిత జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామంలోని వాస్తవ విలువలతో సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో జి.భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డ్వామా పీడీ వెంకటరమణ, పీఆర్, డీఎంహెచ్‌వో, వ్యవసాయం, ఐసీడీఎస్ శాఖల అధికారులు, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ మంజులావాణి, శిక్షణ మేనేజర్ గిడ్డేష్ తదితరులు పాల్గొన్నారు

10న మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేదిన జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ సమావేశంలో తల్లిదండ్రులు, నాయకులు, ఉపాధ్యాయులు భాగం కావాలని అన్నారు. అభివృద్ధికి సంబంధించిన సమావేశంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు క్రీడలు, విద్యా పురోగతి వివరించి వారినుంచి సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణ మిత్రా కిట్స్ పిల్లలందరికీ అందజేస్తామన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

జిల్లా న్యాయాధికారి అమ్మన్నరాజా



చెక్కును అందజేస్తున్న జిల్లా న్యాయాధికారి అమ్మన్న రాజా

నంద్యాల క్రైం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లతో కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని నంద్యాల 3వ అదనపు జిల్లా న్యాయాధికారి అమ్మన్నరాజా, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి, స్పెషల్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏసురత్నం అన్నారు. జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నంద్యాల జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించారు. న్యాయాధికారులు మాట్లాడుతూ లోక్‌అదాలత్ కార్యక్రమంలో నంద్యాల పరిధిలో అత్యధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 1281, మోటార్ ప్రమాద కేసులు 45, సివిల్ కేసులు 9, క్రిమినల్ కేసులు 188 మొత్తం 1523 కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. కక్షిదారులకు రూ.3.70 కోట్లు అందజేశామని చెప్పారు. 2023లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వైద్య విద్యార్థి పర్వేష్ కుటుంబ సభ్యులకు చోళవరం ఇన్సూరెన్స్ కంపెనీ తరపున న్యాయ వాదులు విజయశేఖరరెడ్డి, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రూ.40 లక్షల చెక్కును జిల్లా న్యాయాధికారి అమ్మన్నరాజా అందజేశారు. చిన్న చిన్న సమస్యలకు న్యాయస్థానాలను ఆశ్రయించకుండా ఓక్‌అదాలత్‌కు వెళితే సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. రాజీ అయ్యే కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కుటుంబ కలహాలతో కోర్టులను ఆశ్రయిస్తే పిల్లల భవిష్యత్ దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, లోక్‌అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి, ఉమాదేవి పాల్గొన్నారు.

పుష్కర ఘాట్లను ముంచెత్తిన వరద జలాలు

- శ్రీశైలానికి కొనసాగుతున్న 1.88 లక్షల క్యూసెక్కుల వరద

కొత్తపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు సప్తనదుల సంగమేశ్వరంలోని ఎగువ పుష్కరఘాట్లను వరదజలాలు ముంచెత్తుతున్నాయి. శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాజెక్టుల నుంచి 1.88లక్షల క్యూసెక్కులు వరద జలాలు వచ్చి చేరుతున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 877.40 అడుగులుగా నమోదైంది. అలాగే రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వలు 215 టీఎంసీలు కాగా 175 టీఎంసీలుగా నమోదైంది. ఇదిలా ఉంటే గత వారంలోనే సంగమేశ్వరాలయం పూర్తిగా కృష్ణమ్మ నది గర్భంలో నిక్షిప్తమైన విషయం విదితమే ఈ నేపథ్యంలో ఎగువ పుష్కరఘాట్లపైన ఉన్న ఉమామహేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శివుడ్ని దర్శించుకుని భక్తులు పూజలు చేస్తున్నారు. శ్రీశైలం రిజర్వాయర్ వరదజలాలు అధికంగా చేరుతుండటంతో సముద్ర తీరం తలపిస్తుంది. దీంతో పర్యాటకులు తిలకించేందుకు అధికంగా తరలివస్తున్నారు.



సంగమేశ్వరంలో పుష్కర ఘాట్లను ముంచెత్తుతున్న వరదజలాలు

గంగమ్మ చెరువుకు దిక్కెవరు..?



బి.తాండ్రపాడు గంగమ్మ చెరువు

- వైసీపీ హయాంలో 12 ఎకరాలు పూడ్చేసి కబ్జా
- నాడు చక్రం తిప్పిన నంబరు-2గా ఉన్న ఓ మంత్రి
- ఆయన ఒత్తిడితో విచారణ నివేదికలే మార్చేసిన నాటి ఉన్నతాధికారి..?
- చెరువు పునరుద్ధరణ చర్యలేమయ్యేను?

కర్నూలు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం బి. తాండ్రపాడు గ్రామాన్ని ఆనుకొని పురాతన గంగమ్మ చెరువు ఉంది. వర్షాకాలంలో నిండుకుండలా కళకళలాడేది. ఈ చెరువు వల్ల భూగర్భ జలాలు పెరిగి.. మూడు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండే బోరుబావులు రీచార్జ్ అయ్యేవి. సాగునీటి అవసరం తీరేది. పశువుల దాహం తీర్చే జలపుంతలా గంగమ్మ చెరువు ఆదుకొనేది. ఇదంతా ఒకప్పటి మాట. కర్నూలు నగర విస్తీర్ణం పెరగడంతో చెరువు పరిసరాల్లో రియల్ వెంచర్లు వెలిశాయి. ఎకరం రూ.10 కోట్లకు పైగా పలుకుతోంది. వైసీపీ హయాంలో చెరువుపై అక్రమార్కులు కన్ను పడింది. అప్పటి ప్రభుత్వంలో నెంబరు-2గా చెలామణి అవుతున్న ఓ మంత్రి అండదండలతో ఏకంగా 12 ఎకరాలకు పైగా చెరువును మట్టితో పూడ్చేశారు. ఆ స్థలం విలువ రూ.120 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఆ భూమి చెరువు కాదని, పట్టా భూమి.. అని రెవిన్యూ అధికారులు కొందరు అక్రమార్కులకే వంతుపాడారు. ఇప్పుడు గంగమ్మ చెరువు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

కర్నూలు మండలం బి. తాండ్రపాడు గ్రామాన్ని ఆనుకొని (కర్నూలు నగర శివారు) సర్వే నంబర్లు 76, 77, 78, 79, 80, 81/1, 299, 301, 309, 310 పరిధిలో 53.86 ఎకరాల విస్తీర్ణంలో గంగమ్మ చెరువు ఉంది. జలవనరుల శాఖ రికార్డుల ప్రకారం చెరువు పూర్తి నిల్వ నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) 310.180 మీటర్లు కాగా, నీటి నిల్వ సామర్థ్యం 12.309 ఎంసీఎఫ్‌టీ. బి. తాండ్రపాడు గ్రామానికి చెందిన 62 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. ఈ చెరువు ఆనుకొని వందల ఎకరాల్లో జగన్నాథగట్టు ఉండడంతో వర్షాకాలం ఆ గట్టుపై పడిన వర్షం చెరువులో చేరుతుంది. ఒక్క వర్షం కురిసినా చెరువు నిండుతుంది. ఆయకట్టు పొలాలకు నీరు అందించడమేగాక భూగర్భ జలాలు కూడా ఈ చెరువు వల్ల పెరుగుతాయి. చెరువు దిగువన 3-4 కిలోమీటర్ల వరకు బోరుబావులు రీచార్జ్ అవుతాయని ఇరిగేషన్ ఇంజనీర్లు పేర్కొంటున్నారు. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో ఉన్న గంగమ్మ చెరువును 2005 ఆగస్టు 23న చిన్ననీటి పారుదల శాఖకు అప్పగించారు. 20 ఏళ్లుగా మైనర్ ఇరిగేషన్ పర్యవేక్షణలో కొనసాగుతోంది. తూములు, కాలువలు కూడా ఉన్నాయి. ఈ చెరువు మరమ్మతు పనులు కూడా చేశారు. చెరువును పూర్తిస్థాయిలో ఆధునికీకరణ కోసం 2015 జూలై 21న రూ.90 లక్షలు నిధులు మంజూరు చేస్తూ అప్పటి ఇరిగేషన్ శాఖ కార్యదర్శి శశిభూషన్‌కుమార్ జీవో ఆర్‌టీ నంబరు.479 జారీ జారీ చేశారు. అయితే.. వివిధ కారణాల వల్ల పనులు మొదలు కాలేదు. ఆయకట్టుతో పాటు బి. తాండ్రపాడు గ్రామంతో పాటు నగరంలోని వివిధ కాలనీల పశువులకు దాహం తీర్చేందుకు ఆధారంగా ఉంది. అయితే.. చెరువు పరిసరాల్లో రియల్ వెంచర్లు వేయడంతో చెరువు ఆయకట్టు కూడా కుచించుకుపోయింది. ఈ చెరువుకు సమీపంలోనే రాయలసీమ యూనివర్సిటీ, జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ, ట్రిపుల్ ఐటీ ఎండీ కళాశాలతో పాలిటెక్నిక్ కాలేజీలు, ప్రైవేటు విద్యా సంస్థలు కూడా ఉన్నాయి. భూగర్భ జలాలు పెరిగి ఆయా కాలనీలకు దాహం తీరుస్తుందని ఇంజనీర్లు అంటున్నారు.

మిగతా 6వ పేజీలో

వైసీపీ రావడంతో అక్రమార్కులు కన్నేశారు

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో అక్రమార్కుల కన్ను గంగమ్మ చెరువుపై పడింది. ఎప్పుడో 1932 - 1946 మధ్యలో ఈ చెరువు భూముల్లో క్రయ విక్రయాలు జరిగాయనే రికార్డులు తెరపైకి తెచ్చి కర్నూలు, హైదరాబాద్‌కు చెందిన కొందరు చెరువులో దాదాపు 12 ఎకరాల విస్తీర్ణంలో మట్టి, ఎర్రగరుసుతో 1.20 మీటర్లు నుంచి 1.50 మీటర్ల వరకు పూడ్చేశారు. రియల్ వెంచర్లు వేసేందుకు సిద్ధం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో నెంబరు-2గా చెలామణి అవుతున్న ఉమ్మడి జిల్లాకు చెందిన అప్పటి ఓ మంత్రి, జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు అక్రమార్కులకు అండగా నిలిచారు. ఇంకేముంది అధికారులు సైతం వారికే వంతపాడారు. ఆయకట్టు రైతులు చెరువును కాపాడమని చేసిన ఫిర్యాదులను అధికారులు పట్టించుకోలేదు. రైతులు ఏమీ చేయలేకపోయారు.

పంచాయతీ కార్యదర్శులకు నూతన స్థానాల కేటాయింపు

కర్నూలు కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా పంచాయతీ కార్యదర్శులకు శనివారం జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ నూతన స్థానాలను కేటాయించారు. గ్రేడ్-5 ఐదు సంవత్సరాలు పూర్తయిన వారు 27 మంది, రిక్వెస్ట్ పై 9 మంది, అంతర్ జిల్లా బదిలీపై ఒక్కరూ బదిలీ అ య్యారు. గ్రేడ్-6లో ఐదు సంవత్సరాలు పూర్తయిన వారు 196 మంది, రిక్వెస్టుపై 11మంది అంతర్ జిల్లా బదిలీపై 25మంది బదిలీ అయ్యారు. అదేవిధంగా భూసర్వే డిపార్టుమెంటులో ఐదు సంవత్సరాలు పూర్తిచేసిన వారు 298 మంది, క్రమబద్ధీకరణలో భాగంగా 258 మంది అంతర్ జిల్లా బదిలీలపై 28 మంది రిక్వెస్టుపై 58మంది దరఖాస్తు చేసుకోవడం జరిగింది. వీరందరికి నూతన స్థానాలు కేటాయించారు. రెండు రోజుల్లో నూతన స్థానాల్లోని విధుల్లో చేరనున్నారు.

ఇక నుంచి కర్నూలులోనే వైద్యుల రిజిస్ట్రేషన్

- యూనిట్‌ను ప్రారంభించిన మంత్రి టీజీ భరత్



కర్నూలు మెడికల్ కళాశాలలో వైద్యుల రిజిస్ట్రేషన్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు హాస్పిటల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని వైద్యుల రిజిస్ట్రేషన్, రెన్యువల్, ఇతర సేవలు కర్నూలులోనే అందనున్నాయి. శనివారం వైద్యుల రిజిస్ట్రేషన్ యూనిట్‌ను కర్నూలు మెడికల్ కాలేజీలో పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఎల్లప్పుడూ ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతో 500 సర్వీసులతో వాట్సాప్ గవర్నెన్స్‌ను అభివృద్ధి చేశారన్నారు. మన రాష్ట్రంలో ఉన్న వైద్యులు వారి సర్టిఫికెట్లు రిజిస్ట్రేషన్లు, రీ-రిజిస్ట్రేషన్లు, ఇతర సేవలు ఎక్కడి కక్కడ జిల్లాలో చేయించుకునే ఏర్పాట్లు చేసినట్లు తెలి పారు. గతంలో డాక్టర్లు రిజిస్ట్రేషన్ల కోసం విజయవాడకు వెళ్లాల్సి వచ్చేదని, ఏదైనా సర్టిఫికెట్లు తక్కువైతే వెనక్కి రావడం చాలా శ్రమ, ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని, 60ఏళ్లు పైబడిన డాక్టర్లకు ఇంకా కష్టంగా ఉంటుందని అన్నారు. ఈ కష్టాల నుంచి డాక్టర్లను విముక్తి చేసేందుకు కర్నూలులోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి మాట్లాడుతూ చాలా మంది వైద్యులు రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించుకోకుండా ప్రాక్టీసులో ఉంటారని, దీనివల్ల వారి వైద్య వృత్తికి ఇబ్బందులు కలుగుతాయని అన్నారు. ఇప్పుడు విజయవాడకు వెళ్లకుండా కర్నూలులోనే రెన్యువల్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గుబాటి శ్రీహరిరావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలోనే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించే సేవలను తీసుకుని వచ్చామని ప్రతి శని, ఆదివారాల్లో ఈ కార్యక్రమాలు చేపడుతామన్నారు. గతంలో 40వేల నుంచి 50వేల వరకు ఉండే రీ రిజిస్ట్రేషన్‌ను ఇప్పుడు 75ఏళ్ల పైన ఉన్న వారికి రూ.6వేలు, 75 ఏళ్లలోపు ఉన్న వారికి రూ.8వేలు రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఐదేళ్ల కంటే మూడు నెలల ముందుగా రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి. శ్రీరాములు పాల్గొన్నారు.

మహిమాన్వితం దొర్వి క్షేత్రం

● ఎత్తయిన కొండల్లో ఆధ్యాత్మిక క్షేత్రం ● ప్రతి రోజూ ఉత్తర ద్వార దర్శనమే



నల్లమల సమీపంలో పచ్చదనం మధ్య దొర్వి క్షేత్రం

రుద్రవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎత్తయిన కొండలు, పచ్చని వృక్షాల మధ్య గలగల పారే ప్రకృతి నీటి సవ్వడుల మధ్య విరాజిల్లుతోంది దొర్వి లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం. రుద్రవరం మండలంలో ఉన్న ఈ క్షేత్రం అహోబిలానికి 16 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ క్షేత్రానికి ఆసక్తికర కథనం ఇక్కడి ప్రాంతంలో ప్రాచుర్యంలో ఉంది. దొర్వి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని కాకతీయ ప్రతాపరుద్ర మహారాజు పరిపాలనలో భాగంగా 1398లో (627 ఏళ్ల) క్రితం నిర్మాణం చేపట్టారు. కాకతీయ ప్రతాపరుద్ర మహారాజు పరమశివుడి భక్తుడు. ప్రతిరోజూ స్వర్ణ శివలింగాన్ని కంసలివారిచేత పోత పోయించి ఆ శివలింగానికి పూజలు చేసి బ్రాహ్మణులకు దానం చేసేవాడు. శ్రీశైలం నుంచి తిరుగు ప్రయాణంలో రుద్రవరం సమీపంలో సామంతులు, సేనాధిపతులు, పురోహితుల సమేతంగా బస చేశారు. యథావిధిగా కంసాలి స్వర్ణ శివలింగాన్ని ఎన్నిసార్లు పోత పోసినా నృసింహస్వామి రూపం వచ్చింది. ఈ విషయాన్ని రాజుకు చెప్పాడు. స్వయంగాప్రతాపరుద్ర మహారాజు ముందే శివలింగాన్ని కంసాలి పోత పోశాడు. శివలింగం రాకుండా నరసింహస్వామి రూపం రావడంతో రాజు ఆశ్చర్యపోయాడు. రాజు స్నానం ఆచరించి ఉపవాసంతో ధ్యానంలో నిమగ్నమయ్యాడు. అహోబిళ నరసింహస్వామి సాక్షాత్తు స్వప్నంలో రాజుకు కనిపించి ఇదంతా నృసింహస్వామి క్షేత్రమని, తన మహిమ వల్లే ఇలా జరిగిందని భావిస్తాడు. ఇదిలా ఉండగా దొర్వి అంటే ఓబులానికి ద్వారం. రుద్రవరం సమీపంలో నిర్మించిన దొర్విక్షేత్రంలో శివలింగాన్ని ప్రతిష్ఠించాలని కాకతీయ రుద్రమహారాజు ఆలయాన్ని నిర్మించాడు. ఈ ప్రాంతంలో పోత పోస్తే నరసింహస్వామి ప్రతిమ కనిపించడంతో చెంచులక్ష్మి సమేత లక్ష్మినరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అహోబిళానికి ద్వారమే దొర్వి లక్ష్మినరసింహస్వామి క్షేత్రం అని ఇక్కడి పురాణాల ద్వారా తెలుస్తోంది.



చెంచులక్ష్మి అమ్మవారు సమేత లక్ష్మీనరసింహస్వామి

దొర్వి క్షేత్రంలో 365 రోజులు ఉత్తర ద్వారం పూజలు కొనసాగుతాయి. వైష్ణవ క్షేత్రాల్లో ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారా వెళ్లి పూజలు చేస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం ఏడాది పొడవునా ఉత్తర ద్వార దర్శనమే ఉంటుంది. ఆలయంలో స్వామివారు విల్లంబు చేతబట్టి భక్తులకు దర్శనమిస్తారు. ఈ దొర్విక్షేత్రంలో ఉన్న నీటి గుండాల ప్రకృతి ధార నీటి సరఫరా అవుతుంది. దేవాలయం ప్రాంతంలో ఈ నీరు ఈ వంద ఎకరాలకు సరఫరా అవుతుంది. 627ఏళ్ల క్రితం నిర్మించిన దొర్విలక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని 2021లో పునఃనిర్మాణ పనులు చేపట్టారు. ఆలయం చుట్టూ సూర్యచంద్రులతో పాటు దశావతారాలు, నవనారసింహ క్షేత్రాల ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి.



చంద్రుడు గౌతమబుద్ధుడితో పాటు నవనరసింహ ప్రతిమలు

ఆ ఆరుగురి సహకారంతో



దొర్వి లక్ష్మినరసింహస్వామి క్షేత్రం పునఃనిర్మాణ పనులు వేగవంతంగా సాగాయి. కానాలా వెంకటనరసింహులు, నరసింహ, వరద దస్తగిరి, అన్నదాత ఓబులయ్య, చాకలి నరసింహ, పోలుదాసు లక్ష్మినరసయ్యలు ఆలయ అభివృద్ధిలో కృషి చేశారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం.

- శ్రీనివాసులు
దేవాలయ నిర్వాహకుడు, రుద్రవరం



627 ఏళ్ల క్రితం ప్రతాపరుద్ర మహారాజు నిర్మించిన దేవాలయం (ఫైల్)

హరిత బనగానపల్లె లక్ష్యం: మంత్రి బీసీ

బనగానపల్లె, జూలై 5(ఆంధ్రజ్యోతి): హరిత బనగానపల్లెగా మార్చడమే తన లక్ష్యమని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంత్రి బీసీ జన్మదినం పురస్కరించుకొని బీసీ ఇందిరమ్మ సొంత నిధులు రూ.30 లక్షలతో 5వేల మొక్కలు, కుండీలు కొనుగోలు చేసి హరిత బనగానపల్లె సంకల్పానికి శనివారం శ్రీకారం చుట్టారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తర్వాత బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో పాటు కలెక్టర్ రాజకుమారి, డివైడర్లపై విద్యార్థులతో కలసి మంత్రి బీసీ దంపతులు మొక్కలు నాటారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమానికి అందరూ సహకరించాలని, మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రజలదేనని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత బనగానపల్లె కార్యక్రమానికి బీసీ ఇందిరమ్మ శ్రీకారం చుట్టడం అభినందనీయమని అన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి

సహకారంతోనే అభివృద్ధి

డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, జూలై 5: పరస్పర సహకారంతోనే వ్యక్తులైనా సంస్థలైనా అభివృద్ధి చెందడం జరుగుతుందని జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ డి.విష్ణువర్దన్ రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రాంగణంలో అంతర్జాతీయ సహకార జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు లక్ష్మి మహిళలు సాధించిన ప్రగతిని చూస్తే ఎంతో గర్వపడాల్సి వస్తుందని, అదే విధంగా కలిసిమెలిసి ఉంటే అభివృద్ధి జరగడమే కాకుండా ఎటువంటి ద్వేషాలు, ఘర్షణలు జరగకుండా ప్రశాంతమైన జీవనాన్ని సాగించవచ్చన్నారు. కార్యక్రమంలో డీసీవో వెంకటకృష్ణ, నాబార్డు అధికారి సుబ్బారెడ్డి, బ్యాంకు డీజీఎంలు సునీల్ కుమార్, ఉమామహేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, ఏజీఎంలు త్రినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఎగురవేస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

అమర సంజీవని నేరేడు



చాగలమర్రి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇది మామిడి పండ్ల సీజన్ అని చాలా మందికి తెలుసు. అట్లాగే ఇది నేరేడు పండ్ల కాలం కూడా. మార్కెట్‌లో నేరేడు పండ్లు విరివిగా కనిపిస్తున్నాయి. నేరేడులో పోషకాలు పుష్కలం. వాటికి ఔషధ గుణాలు కూడా ఉన్నాయి.

ఆయుర్వేదంలో నేరేడును అమర సంజీవనిగా పేర్కొంటారు. ఏ, సీ మిటమిన్లు, ఆగ్రాలిక్ ఆమ్లం ఆరోగ్యానికి అత్యవసరం నేరేడు శరీరంలోని విష పదార్థాలను హరిస్తుంది. అందువల్లే సంప్రదాయ వైద్యంలో ఈ పండ్లను విస్తృతంగా వాడేవారు. ఇవి కడుపులోని నులిపురుగులను చంపేస్తాయి. నోటి క్యాన్సర్‌కు మంచి మందులా పనిచేస్తాయి. షుగర్ వ్యాధిగ్రస్థులు నేరేడును తప్పనిసరిగా తినాలి. నేరేడు పండ్ల గింజలను కాల్చి కాల్చి పొడి చేసి నీటిలో కలిపి తాగితే చక్కెరశాతం అదుపులో ఉంటుంది. మూత్రాశయ సమస్యలకు ఇది మంచి టానిక్‌లా పని చేస్తుంది. అతిసారను కూడా నివారిస్తుంది. పండుతో పాటు ఆకులకు కూడా ఔషధగుణాలు ఉన్నాయి. నేరేడు ఆకులతో కట్టుకడితే గాయాలు తగ్గుతాయి. నోటిపూత, చిగుళ్ల వ్యాధులు, దంతక్షయం వంటి సమస్యలు నేరేడు ఆకుల రసాన్ని పుక్కిలిస్తే తగ్గుతాయి. మదనపల్లి, రాజమండ్రి, బెంగుళూరు

రోగ నివారణకు ఔషధ సమానం



ఆటోలో విక్రయిస్తున్న నేరేడు పండ్లు



కుప్పగా పోసిన నేరేడు పండ్లు

ప్రాంతాల నుంచి హైబ్రిడ్ నేరేడు పండ్లు దిగుమతి అవుతున్నాయి. హైబ్రిడ్ కంటే నాటుపండ్లే శ్రేష్ఠం. నల్లమల నుంచి గిరిజన మహిళలు తీసుకొచ్చి విక్రయించే నేరేడు పండ్లకు మంచి డిమాండ్ ఉంది.

గంగమ్మ చెరువుకు దిక్కెవరు?

(5వ పేజీ తరువాయి)

ఫలించిన రాజవర్ధన్‌రెడ్డి పోరాటం



రాజవర్ధన్ రెడ్డి(ఫైల్)

ఆక్రమణల నుంచి బి. తాండ్రపాడు చెరువును, పర్యావరణాన్ని సంరక్షించాలని కోరుతూ టీడీపీ యువ నాయకుడు, కర్నూలు మాజీ ఎంపీపీ డి. రాజవర్ధన్ రెడ్డి 2021లో చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యూనల్ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్) ఆశ్రమించారు. ఆయన ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ అప్లికేషన్ నంబరు-193/2021(ఎస్‌జడ్) విచారణ చేపట్టింది. విచారణ సాగుతుండగానే రాజవర్ధన్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన తండ్రి, టీడీపీ సీనియర్ నాయకుడు, కేడీసీసీబీ చైర్మన్ డి. విష్ణువర్ధన్‌రెడ్డి కేసును కొనసాగించాడు. కర్నూలుకు చెందిన న్యాయవాదులు బి. మోహన్‌కృష్ణ, సాయిసత్య బలమైన వాదనలు వినిపించారు. అదే సమయంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కర్నూలు ఆర్డీవో, తహసీల్దారు, కర్నూలు మైనర్ ఇరిగేషన్ డివిజన్ ఈఈ, సబ్ డివిజన్ డీఈఈ, ఏఈ కమిటీ గ్రామస్థులతో కలసి క్షేత్రస్థాయిలో విచారించింది. రెవెన్యూ రికార్డులు కూడా పరిశీలించింది. పూర్తి వివరాలతో విచారణ నివేదికను గ్రీన్ ట్రిబ్యునల్‌కు పంపించారు. అయితే.. ఈ నివేదిక తయారీలో వైసీపీ హయాంలోని కీలక మంత్రి ఒకరు ఒత్తిడి వల్ల అప్పటి జిల్లాకు చెందిన ఓ కీలకమైన ఉన్నతాధికారి నివేదికను పలుమార్లు మార్చి తయారు చేయించారనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. చెరువు పట్టా భూమినా, క్రయ విక్రయాలు జరిగాయా..? అన్న రెవెన్యూ రికార్డులు పక్కన పెడితే.. గంగమ్మ చెరువు విస్తీర్ణం 53.86 ఎకరాలు వర్గీకరణలో ప్రభుత్వ డ్రై భూమిగా చూపుతూ.. రిమార్క్ కాలంలో ఆర్ఎస్ఆర్-28 ప్రకారం ఇతరుల పేర్లు ఉన్నాయని నివేదికలో చూపారు. అలాగే.. చెరువు కింద 62 ఎకరాలు ఆయకట్టు ఉంటే.. నగరం పెరగడంతో 25-30 ఎకరాలకు తగ్గిందని చూపారు. బోరుబావుల రీచార్జ్, పశువులకు తాగునీరు ఆధారమని వివరించారు. చెరువు వల్ల 3-4 కి.మీల వరకు భూగర్భ జలాలు పెరుగుతున్నా యని, పరిసరాల్లో పలు ఉన్న విద్యా సంస్థలు ఉన్నాయని వివరించారు. సుదీర్ఘ విచారణ అనంతరం గంగమ్మ చెరువు అక్రమంగా పూడ్చివేతలను తొలగించడంతో పాటు చెరువును పునరుద్ధరించాలని గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది.



ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు వెళ్తాం

బి. తాండ్రపాడు గంగమ్మ చెరువులో ఆక్రమణలను తొలగించి చెరువును పునరుద్ధరించమని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చినట్లు మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు గంగమ్మ చెరువును పునరుద్ధరణ చర్యలు తీసుకుంటాం.

● బాలచంద్రారెడ్డి, ఎస్ఈ, జలవనరుల శాఖ, కర్నూలు

శ్రీమఠం వైద్యశాలకు విరాళంగా అంబులెన్స్

మంత్రాలయం, జూలై 5(ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన ఏజే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు రవీంద్ర నాయక్, కృష్ణ పురోహిత్ అనే భక్తులు మంత్రాలయం శ్రీమఠం సుజయీంద్ర ఆరోగ్య వైద్యశాలకు రూ.10 లక్షలు విలువ చేసే అత్యాధునిక వసతులు ఉన్న అంబులెన్స్ వాహనాన్ని విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జ్యోషి, శ్రీపతిఆచార్, సురేష్ కోణాపూర్ తెలిపారు. శనివారం దాతలు కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అంబులెన్స్‌కు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులుచే పూజలు చేసి ఆస్పత్రి సిబ్బందికి అప్పగించారు. దాతల కుటుంబాలకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శ్రీరాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.




అంబులెన్స్‌తో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, దాతలు

సాహిత్యం

తుంగభద్ర తీరం

ఎల్లకాలాలకు 'విప్లవ జ్యోతి'

అల్లూరిపై సురేష్‌బాబు పద్యకావ్యం



కర్నూలు కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వీరులకు మరణం ఉండదు. వాళ్ల భౌతికంగానే దూరమవుతారు. ప్రజల హృదయాల్లో నిత్యం జీవిస్తుంటారు. అలాంటి వారిలో అగ్రగణ్యుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు. బ్రిటీష దొరలను గడగడలాడించిన విప్లవ జ్యోతి అల్లూరి స్మృతిలో అనేక పుస్తకాలు వెలువడ్డాయి. పద్య కావ్య రూపంలో జిల్లాకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ తొగట సురేష్‌బాబు 'విప్లవ జ్యోతి' పుస్తకం విడుదల చేశారు. అల్లూరి సీతారామరాజు చలన చిత్రాన్ని తీసిన దివంగత సినీ నటుడు కృష్ణ ఒక చరిత్ర సృష్టించిన నేపథ్యంలో ఆయనకే ఈ పద్య కావ్యం అంకితం చేయడం విశేషం. విప్లవ జ్యోతి పద్య కావ్యమైనప్పటికీ డాక్టర్ సురేష్‌బాబు అందరూ చదువుకునే సులభశైలితో అక్షరీకరించారు. కవి తొగట సురేష్‌బాబు డిగ్రీ చదువుతున్నప్పుడే 1992లో కావ్య రచన మొదలు పెట్టారు. అలా రాసుకుంటూ 2024 మే నెలలో దీన్ని పూర్తి చేశారు. ఈ పద్యక్యావం తొమ్మిది అశ్వాసాల్లో, వివిధ ఘట్టాలను ఎంతో అందంగా కూర్చారు రచయిత. సీతారామరాజు కుటుంబ నేపథ్యం, ఆయన జననం, బాల్యం, రాజమండ్రిలో తండ్రిగారి వియోగం, అనంతరం నరసాపురం, కాకినాడ, రాజమండ్రి, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో బాబాయ్ వెంట వెళ్లి చదువుకోవడం, విశాఖలో చదువుకునే రోజుల్లోనే సీతతో పరిచయం, సీతా వియోగం, సీతారామరాజుగా పేరు మార్చుకోవడం, చదువుతోపాటు జ్యోతిష్యం, హస్తసాముద్రికం, గుర్రపుస్వారీ, వ్యాయామం, ఈత, నాటకాలు ఇలా అనేక అంశాల్లో రామరాజు పాత్ర చక్కగా తెలియజేశారు. అలాగే మన్యప్రాంత పరిచయం, దారకొండ సమీపంలో సీతారామరాజు యోగిగా ఆవిర్భవించడం, దినచర్య, మన్యం ప్రజలకు దగ్గర కావడం, మన్యంలో బ్రిటీష వారి దురాగతాలను నిలదీయడం, తహసీల్దారు బాస్టియన్ దురాగతాలు, ప్రభుత్వానికి ఫిర్యాదు, అల్లూరి అన్నీ వదిలేసి ఉద్యమంలో పూర్తిస్థాయిలో పాల్గొనడం వంటి అంశాలన్నీ ఈ పుస్తకం చదివితే సీతారామరాజు చరిత్ర కళ్లకు కట్టినట్లు తెలుస్తుంది. అల్లూరి సహచరులుగా పనిచేసిన ఇతర వీర విప్లవ మరణాలను కూడా రచయిత పాఠకులకు సవివరంగా తెలియజేశారు. రామరాజు సీతల పరిచయంలో సీత ఇలా అంటుంది 'శాశ్వతమ్ములు కావు జగతి జీవమ్ములు/శాశ్వతములు కావు సంపదలును/శాశ్వతమది యొకటె సత్కీర్తి గణియించ/పొందవలయు దాని పూని జనులు' అని. సీతారామరాజులో స్వాతంత్ర్య స్ఫూర్తిని రేకెత్తించిన స్త్రీ మూర్తి ఆమె. అలాగే మన్యం వీరుడు రామరాజు తెల్లవాళ్ల తుపాకీ గుండ్లకు బలైనప్పుడు 'ఒరిగె రామరాజు శిరమొక ప్రక్కగా/గుండెజొచ్చి చీల్చ గుండు వడిని/ఆంధ్రవిప్లవ రవి అస్తమించెనటంచు/కుమిలిపోయె ప్రకృతి గుండెలవియ' అని కన్నీరు పెట్టిస్తారు రచయిత. స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీది అహింసా పద్ధతి అయితే, సీతారామరాజుది విప్లవోద్యమ పద్ధతి. తొమ్మిది అశ్వాలుగా రాసిన అల్లూరి జీవిత చరిత్రలో ప్రతి అశ్వమూ ఆసక్తికరంగా చదివిస్తుంది. ఈ పుస్తకం అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలల్లో లభిస్తుంది.



● జంధ్యాల రఘుబాబు, కర్నూలు

ప్రణాళికాబద్ధంగా రాష్ట్రాభివృద్ధి

● పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని, సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రాభివృద్ధికి పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నామని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగర పాలక కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గానికి సంబంధించి స్వర్ణాంధ్ర-పీ4(పబ్లిక్,ప్రైవేటు, పీపుల్స్, పార్టనర్‌షిప్) తొలి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. బంగారు కుటుంబాల ఎంపిక అర్హతలు పక్కాగా పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 2029 నాటికి నియోజకవర్గంలో అర్హులందరికీ వందశాతం ఇళ్లు తప్పనిసరిగ్గా ఉండాలని, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న ఐదేళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. మున్సిపల్ పాఠశాల స్థితిగతులను పరిశీలించి, అవసరమైన ఆధునికీకరణ పనులను చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని, పాతబస్తీలో విచ్చలవిడిగా ఉన్న కరెంటు తీగల సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రధాన రోడ్ల వెంట గోడలను శుభ్రపరిచి పెయింటింగ్ వేయాలని, మొక్కలు నాటడం మరింత వేగవంతం చేయాలని సూచించారు. పార్కింగ్, వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు రహదారులపై ఆక్రమణలు తొలగించాలని, టిడ్కో గృహాల అభివృద్ధికి శ్రద్ధ చూపాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, తహసీల్దారు రవికుమార్, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ లీలా ప్రసాద్, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, సీఎంఎం బాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వజ్రానికి బేరం కుదిరింది

తుగ్గలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల క్రితం పొలం పని చేస్తున్న వ్యవసాయ కూలికి దొరికిన వజ్రానికి బేరం కుదిరింది. శనివారం మండలంలోని పెండేకల్‌కు చెందిన ఓ వ్యవసాయ కూలికి దొరికిన వజ్రాన్ని గుత్తికి చెందిన వజ్రాల వ్యాపారులు రూ.7 లక్షలకు కొనుగోలు చేసినట్లు సమాచారం.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

కర్నూలు అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని



బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తానని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ, ఏఐసీసీ సభ్యుడు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటానని తెలిపారు.. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి అంబటి రామకృష్ణ యాదవ్ స్థానంలో అవకాశం కల్పించిన పీసీసీ అధ్యక్షురాలు వైస్ షర్మిలాకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అఘాయిత్యం

ఆదోని రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అమ్మా నాకు అనారోగ్యంగా ఉంది..ఆసుపత్రికి తీసుకెళ్లమ్మా.. అంటూ పత్తికొండ మండలంలో ఓ ప్రభుత్వ హాస్టల్‌లో చదువుతున్న సి.బెళగల్ మండలానికి చెందిన బాలిక తన తల్లికి కబురు పంపింది. దీంతో ఆ తల్లి ఆ హాస్టల్ కెళ్లి తన బిడ్డను తీసుకొని ఎమ్మిగనూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించింది. ఆ తర్వాత ఇద్దరూ బస్టాండుకు చేరుకున్నారు. ఇంతలో పక్కనే ఉన్న బిడ్డ కనిపించకుండాపోయింది. కానీ బాలిక తన తల్లి ఆదోనికెళ్లే బస్సు ఎక్కిందని తాను కూడా ఎక్కి కూర్చోంది. బస్సులో తల్లి కనపడకపోవడంతో తనతో ఉన్న డబ్బుతో టిక్కెట్ తీసుకొంది. ఆరు గంటల సమయంలో ఆదోని - ఆస్పరి బైపాస్‌లో బస్సు దిగి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న బాలికకు బస్టాండు వైపు వెళ్తున్న మండలంలో ఇస్వీకి చెందిన నిందితుడు ఆటో కనిపించింది. ఆ ఆటో ఎక్కి బస్టాండులో దిగింది. బాలిక ఒంటరిగా ఉందని గుర్తించిన ఆటో డ్రైవర్ రమేష్ పరిచయం పెంచుకున్నాడు. మాయమాటలు చెప్పి ఆటోలో ఆదోని - ఎమ్మిగనూరు బైపాస్‌లోని అడవిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఆ తర్వాత బాలికను హాస్టల్‌లో వదిలిపెట్టడానికి ప్రయత్నిస్తూ పోలీసు స్టేషన్‌కు తీసికెళ్లాడు. ఈ క్రమంలో ఆదోని త్రీటౌన్ సీఐ రామలింగయ్యకు అనుమానం వచ్చి బాలికను విచారించారు. బాలిక తనపై జరిగిన అఘాయిత్యాన్ని వివరించడంతో సీఐ నిందితుడ్ని అదుపులో తీసుకొని తాలుక సీఐ నల్లప్పకు అప్పజెప్పాడు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తాలుక సీఐ నల్లప్ప తెలిపారు.

మహానందిలో క్షుద్ర పూజల కలకలం

మహానంది, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మహానంది సమీపంలోని గరుడనందీశ్వరుని ఆలయానికి అత్యంత సమీపంలో క్షుద్రపూజలు జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. క్షుద్రపూజలు జరిగిన స్థలంలో స్త్రీ బట్టలు, నిమ్మకాయలు, పూజా వస్తువులు చూచి స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రానికి అత్యంత సమీపంలో క్షుద్ర పూజలు జరగడంపై మహానందిలో శనివారం కలకలం రేగింది.

రిమాండ్ ఖైదీ మృతి

కర్నూలు క్రైం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ కేసులో మూడో ముద్దాయిగా ఉన్న నెల్లూరు జిల్లా కావలికి చెందిన పోతురాజు పవన్‌కుమార్ కర్నూలు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని నమ్మించి విజయవాడ వైద్యుడిని మోసం చేసిన కేసులో పోతురాజు పవన్ కుమార్‌ను జూన్ 30వ తేదీన పోలీసులు అరెస్టు చేసి కర్నూలు సబ్ జైలుకు రిమాండ్‌కు పంపారు. అయితే కొంత కాలంగా అతడు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. శుక్రవారం కూడా కిడ్నీ సమస్య తలెత్తడంతో ఆసుపత్రిలో చేర్పించారు. శనివారం డయాలసిస్ కూడా చేశారు. అయితే అతడు కోలుకోలేక మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుంటలోపడి వృద్ధురాలు..

దేవనకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన వృద్ధురాలు నీటికుంటలో పడి మృతిచెందింది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చెన్నమ్మ(80) రెండు రోజుల క్రితం నెల్లిబండ గ్రామంలోని మనవరాలిని చుసేందుకు కాలినడకన బయలుదేరింది. అయితే ఈదులదేవరబండ వద్ద నీరు తాగేందుకు వెళ్లి కుంటలో పడి మృతి చెందింది. గమనించిన స్థానికులు మృతదేహాన్ని బయటకు తీశారు. గతంలోనే భర్త, కుమార్తె మరణించడంతో ఒంటరిగానే ఉంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

మంత్రాలయం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన బోయ అంజనేయ భార్య లక్ష్మి (30) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. లక్ష్మీదేవి గత పదేళ్లుగా టీబీతో బాధపడుతుండేది. బళ్లారి, రాయచూరు, కల్లూరు, ఆదోని, ఎమ్మిగనూరు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. వ్యాధి తీవ్రం కావడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

రైలు నుంచి పడి వృద్ధుడు..

మహానంది, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల-గిద్దలూరు రైల్వే ట్రాక్ పరిధిలోని బొగద టన్నెల్ వద్ద శనివారం 65 సంవత్సరాల వయస్సు గల వృద్ధుడు ప్రమాదవశాత్తు రైలు నుండి జారి పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని జేబులో నంద్యాల నుండి నరసరావు పేటకు రైల్వే టిక్కెట్టు ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

మాజీ సర్పంచ్ ఇంట్లో భారీ చోరీ

కొలిమిగుండ్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వటాల గ్రామంలో భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భూలక్ష్మి, రామ్మోహన్ దంపతుల ఇంట్లో దుండగులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. రాత్రి భోజనం చేసిన తర్వాత తాళం వేసి ఇంటిపై నిద్రిస్తుండగా పక్కనే ఉన్న తాళం చెవిని దొంగలు తీసుకుపోయి చోరీకి పాల్పడ్డారు. బీరువాలో ఉంచిన 7 తులాల బంగారుతో పాటు రూ.1లక్షను ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొలిమిగుండ్ల సీఐ రమేశ్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కర్నూలు నుంచి డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.



పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్ సిబ్బంది

జంతువుల నుంచి ప్రాణాంతక వ్యాధులు

- అప్రమత్తం కావాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక
- నేడు ప్రపంచ జూనోసిస్ డే



పశువును పరీక్షిస్తున్న వైద్యురాలు


కర్నూలు అగ్రికల్చర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మూగ జీవాలను సంరక్షించుకోవడం మన బాధ్యత. లేకుంటే వాటి వల్ల మనుషులకు వ్యాధులు సంక్రమిస్తాయని, అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. భయంకరమైన రేబిస్‌వ్యాధి నివారణకు ఫ్రాన్స్ దేశానికి చెందిన లూయిస్‌పాశ్చర్ అనే శాస్త్రవేత్త టీకా మందును 1885 జూలై 6వ తేదీన కనుగొన్నాడు. దీన్ని పురస్కరించుకొని జంతువుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని, తద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే సందేశాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ చేపట్టింది. సాధారణంగా జంతువుల పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతను విస్మరిస్తే భయంకరమైన వ్యాధులు వాటికి సంక్రమించి తద్వారా మనుషులకు వ్యాపిస్తాయని పశుసంవర్ధకశాఖ జేడీ శ్రీనివాస్ తెలిపారు. సాధారణంగా జంతువులకు, వాటి ద్వారా మనుషులకు వైరస్, బ్యాక్టీరియా వల్ల వస్తాయని ఆయన చెబుతున్నారు. పశుపోషణ చేస్తున్న రైతులు పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, మొదలైన వాటిని పోషించేవారు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రోటోజోవన్ జూనోసిస్..

అమీబియాస్, జియార్డియాసిస్, టాక్సోప్లాస్మోసిస్, బాలన్‌డియోసిస్, నల్లజ్వరం మొదలగునవి.

బ్యాక్టీరియల్ జూనోసిస్..

ఇది బ్యాక్టీరియా వలనే కలిగే వ్యాధులు. ముఖ్యంగా ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, క్షయ, ధనుర్వాతం, సాల్మోనెల్లోసిస్, లెప్టోస్పైరోసిస్ , కోలిబాసిలోసిస్ మొదలగునవి.



మనుషులకు సంక్రమించే వ్యాధులు

బ్రూసెల్లా అబార్టస్ లేక బ్రూసెల్లామిలిటెన్సిస్ అనే బ్యాక్టీరియా వలన బ్రూసెల్లోసిస్ అనే వ్యాపిస్తుంది. విదేశాల నుంచి వలస వచ్చే పక్షుల ద్వారా బర్డ్‌ఫ్లూ అనే వ్యాధి కోళ్లకు వ్యాపిస్తుంది. ఇది వైరస్ వలన సోకే వ్యాధి. పిచ్చికుక్కల ద్వారా భయంకరమైన రేబిస్ వ్యాప్తి చెందుతుంది. వైరస్ వలన రెండు నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లల్లో పందువల్ల మెదడు వాపు వ్యాధి సంక్రమిస్తుంది. ఆంత్రాక్స్ (దొమ్మ వ్యాధి) అనే వ్యాధి బాసిల్లాస్, ఆంత్రాసిస్ అనే బ్యాక్టీరియా వల్ల కలుగుతుంది.

వైరల్ జూనోసిస్:



ఇది సూక్ష్మాతి సూక్ష్మక్రిమి ద్వారా వస్తుంది. ఉదాహరణకు పశువులలో మసూచి, మెదడువ్యాపు, పిచ్చి కుక్క కాటు, బర్డ్‌ఫ్లూ మొదలగునవి.

ఫంగల్ జూనోసిస్..

తామర, కాన్‌డియాసిస్.

పరాన్నజీవుల ద్వారా కలుగు జూనోసిస్..

ఎఖినోకోక్టోసిస్ , టీనియాసిస్, ఫైలేరియాసిస్, ఫేషియాథియోసిస్, సిస్టోసోమియాసిస్, హైడాటిడోసిస్, ట్రైకోస్టాంగైలోసిస్ మొదలగునవి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

పెంపుడు జంతువులకు జూనోసిస్ వ్యాధుల రాకుండా కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద వ్యాధినిర్ధారణ ప్రయోగశాలలో వేస్తారు. వ్యాధి సోకిన పశు, పక్షాదులను మనుషులకు దూరంగా ఉంచాలి. మనుషులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

అప్రత్తమంగా ఉండాలి



జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులను వైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే వెంటనే నివారించుకోవచ్చు. జోనోసిస్ వ్యాధికి కర్నూలు నగరంలోని పాతబస్టాండు వద్ద ఉన్న పాలి క్లీనిక్ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. **- మల్లన్న, పశువైద్యాధికారి, నగర పాలక సంస్థ, కర్నూలు.**

కార్పొరేషన్‌లో అనారోగ్య జంతువులపై అప్రమత్తత

కర్నూలు నగర కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేశాం. నగరంలో నానాటికి పెరిగిపోతున్న వీధి కుక్కలను నివారించేందుకు చర్యలు తీసుకున్నాం. పలు కాలనీల్లో అనారోగ్యానికి గురైన గొర్రెలు, కోళ్ల మాంసాన్ని వినియోగదారులకు అందించకుండా చర్యలు తీసుకుంటున్నాం. **- శ్రీనివాస్, జేడీ**

నా మాట వినకుంటే తలలు తెగుతాయ్

- నేను చెప్పిన డీలర్‌కే బియ్యం ఎత్తించాలి..
- ఓ రెవెన్యూ అధికారికి టీడీపీ నాయకురాలి బెదిరింపులు

ఆదోని రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నేను చెప్పిన డీలర్‌కే బియ్యం ఎత్తించాలి.. నా మాట కాదని వేరే వ్యక్తులకు ఇస్తే తలలు తెగుతాయని ఆదోని నియోజకవర్గానికి చెందిన ఓ టీడీపీ మహిళా నాయకురాలు ఓ మండల రెవెన్యూ అధికారిని బెదిరించారు. నాలుగు రోజుల క్రితం సదరు నాయకురాలు ఓ మండల రెవెన్యూ అధికారికి ఫోన్ చేశారు. కుప్పగల్లుకు ప్రజా పంపిణీ బియ్యం తాను చెప్పిన వ్యక్తికి ఎత్తించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే సంతకంతో కూడిన కూటమి నాయకులు ఇచ్చిన లెటర్ ప్యాడ్‌లో సదరు నాయకురాలు చెప్పిన వ్యక్తి పేరు లేదని, కాబట్టి అతనికి ఇవ్వలేనని ఆ రెవెన్యూ అధికారి తెగేసి చెప్పారు.

దీంతో కోపోద్రిక్తురాలైన సదరు టీడీపీ నాయకురాలు తన మాట వినకుంటే తలలు తెగుతాయని రెవెన్యూ అధికారిని బెదిరించారు. అయితే ఇలాంటి వాటికి తాను భయపడనని రెవెన్యూ అధికారి సమాధానం ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వ్యవహారం పట్ల కూటమి నాయకులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మహిళపై వేధింపులు.. కేసు నమోదు

రుద్రవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన ఓ మహిళను అదనపు కట్నం కోసం, కులం పేరుతో దూషించినట్లు బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహ్మద్‌రఫి తెలిపారు. రుద్రవరం గ్రామానికి చెందిన యువతి, ఆళ్లగడ్డకు చెందిన యువకుడు ప్రేమించి, పెద్దల అంగీకారం లేకుండా కులాంతర వివాహం చేసుకున్నారు. తర్వాత భర్త, తల్లిదండ్రులు వేధింపులకు గురిచేసి కులం పేరుతో దూషించి అదనపు కట్నం తేవాలని వేధించడం మొదలు పెట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థుల అ'పూర్వ' కలయిక



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నగర శివారు బి.తాండ్రపాడులోని పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం సందడి సందడిగా సాగింది. సుమారు 30 ఏళ్ల అనంతరం కలుసుకున్న మొదటి బ్యాచ్ విద్యార్థుల మొదలు గత ఏడాది చదువు పూర్తిచేసుకున్న వారి వరకు సుమారు 500 మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒకరినొకరు పరస్పరం ఆప్యాయంగా మాట్లాడుకుంటూ, అలనాటి తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఆనందోత్సాహాల మధ్య గడిపారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలో తాము చేసిన అల్లరిని గుర్తు చేసుకొని మురిసిపోయారు. వీరి సంబరాలకు కళాశాల ప్రాంగణం వేదికైంది. ఈ కళాశాల్లో 1996 నుంచి 2024 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, అనిల్, దీప్తి, కొడవలి శివరామకృష్ణ, సుధీర్, ఇస్మాయిల్, అనిల్, రఫీ, రవి ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. గతంలో కళాశాల్లో పనిచేసిన వారితోపాటూ ప్రస్తుతం పని చేస్తున్న అధ్యాపకులు షరీఫ్, వై. సురేష్‌బాబు, ఓరుగంటి శ్రీధర్, వెంకటయ్య, భీమా నాయక్, జి. సురేష్‌లను శాలువ, పూలదండలతో ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రస్తుత ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీఎస్ఎస్ఎన్ ప్రసాద్, బయోమెడికల్ శాఖాధిపతులు రామాంజినేయులు, సుజాత, విశ్రాంత అధ్యాపకులు గోకారి, వేణుగోపాల్, ఎస్‌శ్రీన్ ప్రసాద్, గౌస్ సాహెబ్ పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలకు రూ.6.50 కోట్లు

- కొత్త వంగడాలు సృష్టించాలి
- విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేస్తాం
- ఎన్‌జీఆర్ఏయూ వీసీ శారదా జయలక్ష్మి

మహానంది, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాలల అభివృద్ధికిగాను ఐసీఆర్ సంస్థ రూ.6.50 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ శారదా జయలక్ష్మి తెలిపారు. శనివారం రాత్రి వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం డీన్ వి.జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. వీసీ శారదా జయలక్ష్మి హాజరయ్యారు. కళాశాల శాస్త్రవేత్తలు రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. క్రీడాపోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందచేసారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ విద్యలో జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. వరి వంగడాల్లో బిపిపిటీ-5204తో పాటు స్వర్ణ రకాలను న్యూఢిల్లీలోని జీనా హెడిటేజ్ సంస్థ సరికొత్త ప్రయోగాలు చేసి కీమికీటకాలు సోకకుండా సరికొత్త టెక్నాలజీతో తయారు చేసిందన్నారు. సీఎం చంద్రబాబు వ్యవసాయ కళాశాలలను సరికొత్త టెక్నాలజీతో మరింత ముందుకు తీసుకొని పోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ అగ్రికల్చరల్ ఆఫీసర్ చేరుకూరి శ్రీనివాసరావు, నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జాన్సన్, శాస్త్రవేత్తలు విజయ బాస్కర్, స్వరాజ్యలక్ష్మి, నారాయణరావు, మల్లేశ్వరరెడ్డి, త్రినాథరెడ్డి పాల్గొన్నారు.



సావనీర్ విడుదల చేస్తున్న వీసీ

ఇన్‌చార్జి లేకుండా ఎలా నిర్వహిస్తారు..?

- జిల్లా నాయకత్వంపై వీరభద్రగౌడ్ వర్గం ఆగ్రహం
- 'సుపరిపాలనలో తొలి అడుగు' సభను అడ్డుకోవడంతో ఉద్రిక్తత



జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో వీరభద్రగౌడ్ అనుచరుల వాగ్వాదం

కర్నూలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఇన్‌చార్జి లేకుండా సుపరిపాలనలో తొలి అడుగు సమావేశాలు ఎలా నిర్వహిస్తారు? కార్యకర్తలకు ఏమని సంకేతాలు ఇస్తున్నారు..? అంటూ ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బి.వీరభద్రగౌడ్ వర్గం ఆగ్రహం చేశారు. శనివారం ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరి, ఆలూరులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలను ఆయన వర్గీయులు అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వీరభద్రగౌడ్ వర్గీయులను పోలీసులు బయటకు తోసేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి డౌన్.. డౌన్, టీడీపీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ల కమిటీ గోబ్యాంక్ అంటూ నినాదాలు చేశారు. ఆలూరు ఇన్‌చార్జి బి.వీరభద్రగౌడ్, కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం ప్రసాద్ వర్గాలు మధ్య వర్గవిభేదాలు భగ్గుమంటున్నాయి. ఇరువర్గాలు సమన్వయంతో పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసినా ఎవరిదారి వారిదే అన్నట్లు ముందుకు సాగుతున్నారు. ఈ నెల 2 నుంచి టీడీపీ అధిష్ఠానం సుపరి పాలనలో తొలి అడుగు పేరిట ఇంటింటికి వెళ్లి ఏడాదిలో చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు వివరించాలని టీడీపీ శ్రేణులకు నెల రోజుల ప్రణాళిక ఇచ్చింది. ఆలూరు టీడీపీలో ఇరు వర్గాలను సమన్వయం చేస్తూ పార్టీ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఇన్‌చార్జి మంత్రి నిమ్మల, ఎంపీ బస్తిపాటి నాగరాజు, పరిశీలకుడు పూల నాగరాజును టీడీపీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్లుగా నియమించింది. ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు ఇక్కడ అడుగు కూడా పెట్టలేదు. శుక్రవారం ఎంపీ బస్తిపాటి నాగరాజు, పరిశీల కుడు పూల నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ లేకుండా దేవనకొండ, చిప్పగిరి మండలాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' సమావేశాలు నిర్వహించారు. ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ వర్గీయులకు మింగుడు పడలేదు. శనివారం కూడా ఆస్పరి, ఆలూరులో ఇన్‌చార్జి లేకుండానే సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ హాజరయ్యారు. ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ వర్గీయులు ఆస్పరిలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సతీశ్, సీనియర్ నాయకుడు సంజప్ప ఆధ్వర్యంలో, ఆలూరులో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి నర్సప్ప, టీడీపీ మండల మాజీ కార్యదర్శి ముద్దు రంగయ్య, పట్టణ కార్యదర్శి మసాల జగన్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఇన్‌చార్జి లేకుండా ఎలా నిర్వహిస్తున్నారంటూ నిలదీశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వారిని బయటకు పంపించాక తొలి అడుగు సమా వేశాలు నిర్వహించారు. ఆలూరు సభలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ అధిష్ఠానం ఆదేశాల మేరకు వీరభద్రగౌడ్‌ను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగించామని, జోన్-5 ఇన్‌చార్జి బీద రవిచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా అలాంటిదేమీ లేదని పేర్కొనడం కొసమెరుపు.

భక్తి శ్రద్ధలతో చిన్న సరిగెత్తు


భక్తులతో పూజలందుకుంటున్న కొలువుదీరిన పీర్లు

ఆత్మకూరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం చిన్నసరిగేత్తును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని వడ్లరామాపురం, కురుకుంద, శ్రీపతిరావుపేట, నల్లకాలువ, బాపనంతాపురం సిద్ధపల్లి, వెంకటాపురం, అమలాపురం, ఇందిరేశ్వరం గ్రామాల్లో చిన్నసరిగేత్తు సందర్భంగా పీర్లను ఊరేగించారు. ఆయా గ్రామాల్లో పీర్లచావిడి వద్ద పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలు కులమతాలకతీతంగా భక్తులు తరలి వచ్చి పీర్లకు పూల దత్తీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన మొహర్రం

బండిఆత్మకూరు: మండలంలోని పెద్దదేవళాపురం గ్రామంలో మొహర్రం ముగిసింది. తొమ్మిది రోజులుగా భక్తిశ్రద్ధలతో మొహర్రం జరిపి శనివారం సాయంత్రం పీర్ల కమిటీ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పీర్లను గ్రామ శివారులోని పురాతన బావిలో ఖననం చేసి. తిరిగి పీర్ల చావిడికి చేర్చారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి



సంతజూటూరు సొసైటీలో మొక్క నాటుతున్నకేడీసీసీ బ్యాంక్ మేనేజర్ సుధారాణి

బండిఆత్మకూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైతులు సహకార సంఘాల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని కెడీసీసీ బ్యాంక్ మేనేజర్ సుధారాణి సూచించారు. శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవంలో భాగంగా సంతజూటూరులోని ది పరమటూరు రైతు సేవా సహకార సంఘంలో ఆమె రైతులతో కలసి జెండాను ఎగురవేశారు. అనంతరం మొక్క నాటి నీరుపోశారు. ఎలాంటి జాప్యం లేకుండా రుణాలు చెల్లిస్తే తిరిగి ఇవ్వటానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని ఆమె అన్నారు. అసిస్టెంట్ మేనేజర్ శ్రీవాణి, సీఈవో గోపాల్, సిబ్బంది విజయ్, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

గోసంరక్షణకు విరాళం

నంద్యాల టౌన్ జూలై 5(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో దేవస్థానంలో ఉన్న గోసంరక్షణకు తెనాలికి చెందిన సబ్బయ్యఅనే వ్యక్తి రూ.1,00,111 విరాళంగా ఇచ్చినట్లు పర్యవేక్షరాలు హిమబిందు తెలిపారు. అనంతరం వారికి దేవస్థానం తరపున రసీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారన్నారు. ఆలయం సిబ్బంది పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

కొత్తపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలని రూరల్ సీఐ సురేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి సీఐ మండలంలోని దుద్యాల గ్రామంలో ఎస్ఐ జయశేఖర్‌తో కలిసి మొహర్రం ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక బస్టాండు సెంటరులో సీఐ గ్రామస్థులతో మాట్లా డారు. పీర్లు ఏటికి వెళ్లేసమయంలో మద్యం సేవించి శాంతిభద్రత లకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుద్యాల శివారులో ఇద్దరు వ్యక్తులు మద్యం సేవిస్తుండటంతో ఎస్ఐ వారినుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

వాహనాల తనిఖీ

మండలంలోని లింగాపురం గ్రామ శివారులో కొత్తపల్లి ఎస్ఐ జయశేఖర్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. శనివారం రాత్రి గ్రామ శివారులో తన సిబ్బందితో కలిసి ట్రాక్టర్లు, బైకులు, ఆటోలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పది వాహనాలకు రికార్డులు లేనట్లుగా గుర్తించి కేసులు నమోదు చేశామని తెలిపారు.

ప్రజల పక్షాన పోరాటాలు

ఆత్మకూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన సీపీఐ నిరంతరం పోరాటం సాగిస్తున్నట్లు ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు పేర్కొన్నారు. శనివారం సీపీఐ మండల, పట్టణ మహాసభలను పురస్కరించుకుని స్థానిక గౌడ్ సెంటర్ నుంచి ఎంఎం గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా సీపీఐ ప్రజా ఉద్యమాలు సాగించి శతవసంతాలను పూర్తి చేసుకుని ప్రజల మనసును గెలుచుకున్నట్లు తెలిపారు. నాయకులు ప్రతాప్, అహ్మద్ హుసేన్, చాంద్‌బాషా, వెంకటశివుడు, ముర్తుజాబీ, రాణెమ్మ ఉన్నారు.

బోధనేతర పనులు పెట్టరాదు

నంద్యాల హాస్పిటల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులతో బోధనేతర పనుల ఒత్తిడి పెట్టకూడదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య ఖండించారు. శనివారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో జరిగే సమావేశంలో విద్యార్థుల భవిష్యత్ రూపకల్పనకు, విద్యాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కోసం సంబంధించిన విషయాలు చర్చించాలని అన్నారు. సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ రకరకాల కమిటీలు ఏర్పాటు చేయాలని, ఆటల పోటీలు నిర్వహించాలని, బోధనేతర పనులు ఉపాధ్యాయులు చేయాలని ఒత్తిడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయించడం మానుకోవాలని పీటీఎంలో విట్‌నెస్ అధికారి నియామక ఉత్తర్వులు రద్దుచే యాలన్నారు.

సమస్యలు పట్టించుకోకపోవడం అన్యాయం

ఆత్మకూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవోఎంఎస్ నెం.36 ప్రకారం జీతాలు పెంచాలని నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లానాయకుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్దనాగరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టి అక్కడ నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలను చెల్లించాలన్నారు.

రోకలి బండతో స్నేహితుడిపై దాడి

మిడుతూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తాగిన మత్తులో స్నేహితుడిని రోకలిబండతో తలపై బాదిన సంఘటన మండల కేంద్రమైన మిడుతూరులో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన చిన్న నాగన్న, ఇమామ్ సాబ్ ఇద్దరూ స్నేహితులు. శుక్రవారం రాత్రి చిన్న నాగన్న ఇంట్లో ఇద్దరు స్నేహితులు కలిసి మద్యం సేవించారు. ఇరువురికి మాటకు మాట పెరిగి మద్యం మత్తులో చిన్న నాగన్నను ఇమామ్ సాబ్ రోకలి బండతో తలపై బాదాడు. తలకు తీవ్ర గాయం అయ్యింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అతడిని 108ద్వారా కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చిన్ననాగన్న భార్య వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇమామ్ సాబ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.

ప్రాజెక్టులను గాలికొదిలేసిన వైసీపీ

- రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- కొత్తపల్లిలో 'తొలి అడుగు' ● హాజరైన ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రాజధానితో పాటు పలు ప్రాజెక్టుల నిర్మాణాలను గాలికొదిలేసిందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆరోపించారు. శనివారం నంద్యాల మండల కొత్తపల్లి గ్రామంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి ఆధ్వర్యంలో 'తొలి అడుగు' నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలోనే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నుంచి అభివృద్ధి వైపు నడిపించేందుకు అవిశ్రాంతంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని కొనియాడారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోనే ఏపీ అభివృద్ధి ఒక రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వ కృషిచేస్తుందన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నంద్యాల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ఆలపు నరసానాయుడు మాట్లాడుతూ ఎక్కడ చూసినా చంద్రబాబు పాలనపై ప్రశంసల జల్లులు కురుస్తున్నాయన్నారు. ప్రజల నుంచి సేకరించిన సమస్యలు, అభిప్రాయాలను పై టీడీపీ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగవతం చేసిందన్నారు. తల్లికి వందనం పథకం ప్రతి ఇంటిలో ఆనందాన్ని నింపిందన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న న్యాయ శాఖ మంత్రి ఫరూక్, ఆలపు నరసానాయుడు

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్ : ఎంపీ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పొందిన బాధితులతో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) పేదలకు వరమని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. శనివారం నంద్యాల పట్టణ బొమ్మలసత్రంలోని ఎంపీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా విడుదలైన రూ2,12,589 లక్షల చెక్కులను రోగులకు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీదైన వైద్యాన్ని పేదలకు కూడా అందించాలని ప్రభుత్వం ఆర్థికంగా సహకరిస్తుందన్నారు. మెరుగైన వైద్యంకోసం ప్రైవేట్ హాస్పిటల్‌లో వైద్యం చేయించుకున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అందించడం అభినందనీయమన్నారు. ఆళ్లగడ్డ నియోజక వర్గం బాచేపల్లెకు చెందిన ముత్యాలపాడు మహమ్మద్‌హుస్సేన్‌కు రూ 81,311, నంద్యాల పట్టణం ఎస్‌బీఐ కాలనీకి చెందిన అనకల సుజాతకు రూ31,278, నంద్యాలలోని జగజ్జననీనగర్‌కు చెందిన ముల్లాఅస్మకు రూ25,000, నంద్యాల మండల అయ్యలూరుకు చెందిన నజియా సుల్తానకు రూ35,000ల చెక్కులను అందజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమీ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గిత్తజయసూర్య అన్నారు. మండలంలోని పోతులపాడు గ్రామంలో శనివారం 'తొలి అడుగు' నిర్వహించారు. ఏడాదిలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కల్లిబొల్లిమాటలతో ప్రజలను మభ్యపెట్టారని, చంద్రబాబు ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని ఆచరణలో చేసి చూపించారన్నారు. ఇంటింటికి వెళ్లి అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, వెంకటేశ్వర్లుయాదవ్, మోహన్‌రెడ్డి, గిరీశ్వరరెడ్డి, రవికాంత్, శ్రీనివాసులు, వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మన్నగౌడు, కృష్ణారెడ్డి, పెద్దన్న వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిడుతూరు: కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి అన్నారు. మండలంలోని దేవనూరులో 'తొలి అడుగు'లో ఆమె పాల్గొన్నారు. సర్పంచు హరిత, టీడీపీ నాయకులు సుంకిరెడ్డి, శ్రీను, అయ్యన్న, రాముడు, నవద్ అలి, పెద్దమౌలా, సీతారామిరెడ్డి, అంకిరెడ్డి, అయ్యపురెడ్డి, గోకారి, నాగేశ్వరరావు, మహేష్, చంద్రశేఖర్ రెడ్డి, బద్రా రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి హామీని నిలబెట్టుకుంటాం : ఎమ్మెల్యే గౌరు

పాణ్యం: ప్రజలకిచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుంటామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం గోరుకల్లులో 'తొలి అడుగు'లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే సూపర్‌సిక్స్‌లో భాగంగా పించన్ల పెంపు, మెగా డీఎస్సీ, ఉచిత గ్యాస్, తల్లికి వందనం పూర్తిచేశామన్నారు. మండలంలో ఇప్పటికే రూ. 20 కోట్లతో రహదారులు, తాగునీరు, మురుగుకాల్వలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పనితీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ ఆదన్న, మండల టీడీపీ కన్వీనర్ జయరామిరెడ్డి, ఎంపీటీసీ రంగరమేష్, నంద్యాల రవి, సురేష్, వెంకటేశ్వర్లు, ఖాదర్‌బాష, బాలనాయుడు, రాంమోహన్‌నాయుడు, ఉశేన్‌వలి, కరీంబాష, రసూల్, సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి పాల్గొన్నారు.


పోతులపాడులో ఇంటింటికి వెళ్లి పలకరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నాయకులు

ప్రభుత్వ పథకాలపై అవగాహన

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో టీడీపీ మండల కన్వీనరు పలుచాని మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏడాది పాలనలో ప్రభుత్వం ప్రజలకు అందచేసిన కార్యక్రమాలను తెలిపారు. టీడీపీ నాయకులు లోకానందరెడ్డి, ఎంపీటీసీ చంద్రమోహన్ ఉన్నారు.

ఇంటింటికి తిరుగుతూ..

బండిఆత్మకూరు: ఎన్నిలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని కేసీ కెనాల్ చైర్మన్ రామలింగారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ చిన్నలింగారెడ్డి పేర్కొన్నారు. నెమిళ్ళకుంట, ఈర్నపాడు గ్రామాల్లో వారు వేరువేరుగా 'తొలి అడగు' నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు. వీరనారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రతాపరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

'తొలి అడుగు'కు విశేష స్పందన

గోస్పాడు: సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శనివారం సాంబవరంలో మండల టీడీపీ అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ అధ్యక్షుడు జూపల్లె రాంగోపాల్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి: సీఐటీయూ

నంద్యాల హాస్పిటల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జీజీహెచ్‌లో, మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు 3నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. వేతనాల కోసం చేపట్టిన నిరసన 4వ రోజుకు చేరింది. నిరసనలో భాగంగా జీజీహెచ్ ఆవరణలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి చెన్నయ్య, నాగన్న మాట్లాడుతూ 3నెలలుగా వేతనాల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఆస్పత్రి కాంట్రాక్టర్ స్పందించడంలేదని, ఆస్పత్రిలో పనిచేస్తున్న ఎస్ఓ కేజేరెడ్డి సిబ్బందిని వేధిస్తున్నారని వాపోయారు. ఎంఓయూ ప్రకారం రూ.18,600ఇవ్వాల్సి ఉండగా రూ.8,300మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్నారు. ఆస్పత్రిలో సెక్యూరిటీ సిబ్బంది 45మందిని నియమించాల్సి ఉండగా 37మందితోనే పనిచేయించుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీ, హైమావతి, సుబ్బరాయుడు, రమాదేవి, లోకేష్, వినోద్, చిన్నచెన్నయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.


జీజీహెచ్ ముందు ధర్నా చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

సీఎం దార్శనికతకు ప్రతిరూపమే పీ-4

- పేద కుటుంబాలను బలోపేతం చేయడమే లక్ష్యం ● శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు దార్శనికతకు ప్రతిరూపమే పీ-4 అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో శ్రీశైలం నియోజకవర్గ స్థాయిలో విజన్-2047 ప్రణాళికకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎంతో దార్శనికతతో పీ-4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్నర్‌షిప్) విజన్-2047 రూపొందించారన్నారు. దీనిద్వారా వెనుకబడిన కుటుంబాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈవిషయంలో ప్రతిఒక్కరూ లేనిపోని అపోహలు వీడి పీ-4 లక్ష్యాలను సాధించడంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ కోసం పరితపిస్తుండగా రాష్ట్రంలో సీఎం చంద్రబాబు విజన్-2047 లక్ష్యం కోసం పనిచేస్తున్నారని తద్వారా అన్ని గ్రామాలు అభివృద్ధి చెంది దేశాభివృద్ధిలో కీలకంగా మారనున్నాయని చెప్పారు. పీ-4 లక్ష్యంలో భాగంగా శ్రీశైల నియోజకవర్గంలో టెంపుల్ టూరిజం అభివృద్ధికి కృషి చేయడంతో పాటు హార్టికల్చర్ పంటల వృద్ధికి శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గం పరిధిలో రూపొందించిన పీ-4 లక్ష్యాలకు సంబంధించిన పవర్ ప్రజెంటేషన్‌ను అధికారులతో కలిసి ఆయన తిలకించారు. ఇదిలావుంటే ఈ సమావేశానికి అటవీశాఖ అధికారులు డుమ్మా కొట్టడంతో ఎమ్మెల్యే బుడ్డా సీరియస్ అయ్యారు. నియోజకవర్గంలో 75శాతం అటవీ ప్రాంతం ఉందని, అయినప్పటికీ వారు నిర్లక్ష్యం ఉండటం సరికాదని మండిపడ్డారు. ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, శ్రీశైలం ఐటీడీఏ ఏపీవో సురేష్‌కుమార్, డ్వామా పీడీ సూర్యనారాయణ,అధికారులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి


పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తున్న అధికారులు

పేదలను ధనవంతులను చేయడమే..

నందికొట్కూరు: పేదలను ధనవంతులను చేయ డమే పీ4 లక్ష్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయ సూర్య అన్నారు. శనివారం పట్టణంలోని అల్లా కల్యాణ మండ పంలో పీ4 సర్వేపై కార్యక్రమాన్ని అర్టికల్చర్ జిల్లా అధికారి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ పేదరిక నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన 'జీరోపావర్టీ-పీ4' కార్యక్రమాన్ని విస్తృత పరిచేందుకు ఆగస్టు 15 నాటికి రూ.5 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూసేందుకు ప్రభుత్వం స్టేట్ లెవెల్ సొసైటీని ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, తహసీల్దార్ శ్రీనివాసులు, కమీషనర్ బేబి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం శర్మ, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్య పరికరాలు వితరణ


కలెక్టర్ రాజకుమారికి వైద్య పరికరాలు అందజేస్తున్న అల్ట్రాటెక్ సిమెంట్ సంస్థ సభ్యులు

నంద్యాల టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): అల్ట్రాటెక్ సిమెంట్ సంస్థ వారు నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యపరికరాలు వితరణ చేశారు. శనివారం కలెక్టర్ సమక్షంలో కలెక్టరేట్‌లో రూ.12లక్షలు విలు వైన వైద్య పరికరాలు అందజేసినట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థ వారు సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి సాయం చేయడం ఎంతో సంతోషమన్నారు. ఈసీజీ మెషిన్ 2, డెఫ్రిబిలేటర్ 1, సక్షన్ అప్పారేటస్ 2, 2వైన్ పెండర్స్ అందజేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో పేదలకు ఇంకా మెరుగైన సేవలు అందించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లీశ్వరి, సంస్థ సభ్యుల సాజేంద్రకుమార్, ఆంజన్ ప్రకాశ్, సురేశ్, గోపాల్‌రెడ్డి, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయొద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం సంజీవనగర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, అదానితో జరిగిన ఒప్పందాలను రద్దుచేసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సర్దుబాటు చార్జీలపేరుతో ప్రజలపై రూ15,485 కోట్ల భారం వేసిం దని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే నాలుగుసార్లు ప్రజలపై విద్యుత్ చార్జీల బారాన్ని మోపారని ఆరోపించారు. ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు భూమిని శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అంతర్రాష్ట్ర స్థాయి పశు ప్రదర్శన


గోరుకల్లులో పశుప్రదర్శన పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

పాణ్యం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరుకల్లులో మొహర్రం సందర్భంగా శనివారం అంతర్రాష్ట్ర పశుప్రదర్శన పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీలను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రారంభించారు. మొదట ఆమె పెద్దస్వామి, డాల్‌స్వామి పీర్లకు ఫతేహాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో 14 జతల వృషభాలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.50వేలు కోడుమూరు మండలం వెంకటగిరికి చెందిన బీఎల్‌కే బుల్స్ గెలుచుకున్నాయన్నారు. ద్వితీయ బహుమతి రూ.40వేలు నాగర్ కర్నూలు జిల్లా రాయవరానికి చెందిన అక్షరరెడ్డి వృషభాలు, తృతీయ బహుమతి రూ.30వేలు బీఎల్‌కే బుల్స్ నాలుగో బహుమతి రూ.20వేలు బనగానపల్లె మండలం పాతపాడుకు చెందిన చంద్రశేఖరరెడ్డి వృష భాలు, ఐదవ బహుమతి రూ15 వేలు కడపజిల్లా దాసరిపల్లికి చెందిన ముసాని చంద్రశేఖరరెడ్డి వృషభాలు గెలుపొందాయి. కార్యక్రమంలో నంద్యాల రవికుమార్, నంద్యాల వెంకటేశ్వర్లు, రసూల్, సురేష్, ఉశేన్‌వలి, పెద్దస్వామి, డాల్‌స్వామి దర్గా కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం: సుజల


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నందిపైప్స్ ఎండీ సుజల

నంద్యాల హాస్పిటల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం అని నంది గ్రూప్స్ సంస్థల అధినేత్రి సుజల పేర్కొన్నారు. పట్టణంలోని నందిపైప్స్ బాడ్మింటన్ అకాడమిలో శనివారం ఉమ్మడి కర్నూలు జిల్లాస్థాయి బాడ్మింటన్ ఎంపిక పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. జిల్లా స్థాయి పోటీలు ఇక్కడ నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలు ప్రతిరోజు దినచర్యలో భాగం కావాలన్నారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించి ముందుకు సాగాలన్నారు. జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వంశీధర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ ఎంపిక పోటీల్లో అండర్-11, 13, 15, 17, 19 బాల, బాలికలకు, పురుషుల, మహిళా విభాగంలో సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శేషిరెడ్డి, సంజీవరెడ్డి, బాడ్మింటన్ కోచ్ నాగార్జున పాల్గొన్నారు.

నీలి సికారి కాలనీలో ఎక్సైజ్ దాడులు

- 30 లీటర్ల సారా స్వాధీనం

నందికొట్కూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నీలిషికారి కాలనీలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో షికారి ముకింద్ర అనే వ్యక్తిని అరెస్టుచేసి 30 లీటర్ల సారా సీజ్‌చేసి, 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు తెలి పారు. సారా తయారీచేయడం, అమ్మడం వంటి కార్యకలాపాలు మానిపించేందుకు వారికి పునరావసం కల్పించే కార్యక్రమంలో భాగంగా మెప్మా అధికారిని శాంతకుమారి ఆధ్వర్యంలో పొదుపు సంఘం వారిని అందరిని కలిసి వారికి లోన్ ఇప్పించేందుకు ఉన్న అవకాశాల మీద చర్చించారు. నందికొ ట్కూరు సహకార బ్యాంక్ మేనేజర్ నాగరాజుతో కలిసి ఒక సంఘానికి లోన్ ఇప్పించేందుకు అధిక మొత్తము లోన్ ఇప్పించే విధంగా చర్చించినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్.ఐ. జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు శంకర్ నాయక్, కృపవరకుమారి, కానిస్టేబుళ్లు సుధీర్‌కుమార్, మధుసూదన్‌ప్రసాద్, శ్వేతారాణి, రమిజాబీ పాల్గొన్నారు.


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఆళ్లగడ్డ డివిజన్‌లో 6,574 గృహాలు పూర్తి

చాగలమర్రి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలో 12,409 గృహాలు మంజూరు కాగా 6,574 గృహాలు పూర్తయినట్లు హౌసింగ్ డీఈ విజయబాబు తెలిపారు. శనివారం చాగలమర్రి గ్రామంలో లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నరసింహరావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఓబులేసు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు: డీఈ

చాగలమర్రి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని 33 కేవీ విద్యుత్ లైన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని విద్యుత్‌శాఖ కేంద్రంలో విద్యుత్ లైన్‌మెన్లు, ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండి విద్యుత్ సమస్య పరిష్కరించాలన్నారు. ఏఈ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 309 కేసులు పరిష్కారం

కోవెలకుంట్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. 300 కేసులు పరిష్కరించినట్లు ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కోవెలకుంట్ల లోక్ అదాలత్ ఇన్‌చార్జి న్యాయాధికారి భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓబులేసు, వైస్ ప్రెసిడెంట్ శేఖర్, తిరుపతయ్య తిరుపాలు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

దొర్నిపాడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో సావిత్రి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయా శాఖ అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో తహసీల్దార్ సుభద్ర, ఏవో ప్రమీల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, హౌసింగ్ ఏఈ బ్రహ్మయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, వెలుగు ఏపీఎం బాబు, పశువైద్యాధికారి చిన్నబాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలించొద్దు

డోన్ రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): డోన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలిస్తే ప్రజలు ఇబ్బందులకు గురవుతారని డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు అన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపును వ్యతిరేకిస్తూ శుక్రవారం వైసీపీ నాయకులు రిలే దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా వలంటరీ విభాగం అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లి రామ చంద్రుడు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు ఆశాజ్యోతి మంత్రి బీసీ

కొలిమిగుండ్ల, జూలై 5, (ఆంధ్ర జ్యోతి): రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బలహీన వర్గాల కు ఆశా జ్యోతి అని టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మొక్కలు నాటారు. కనకాద్రిపల్లెలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త వీఆర్ లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి బీసీ పుట్టిన రోజు వేడుకలు ఘనం గా నిర్వహించారు. కార్యక్రమంలో బందార్లపల్లె కళ్యాణ్‌రెడ్డి, శంకర్ రెడ్డి, గిరి, తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటి నీరు పోస్తున్న రామేశ్వర్‌రెడ్డి

పాత్రికేయులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలి

బనగానపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల పట్టాలు ఇవ్వాలని పాత్రికేయులు కోరారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. మంత్రి బీసీ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పాత్రికేయులకు ఇళ్ల పట్టాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో విలేకర్లు పి.వెంకటేశ్వర్లు, సర్వేశ్వరరెడ్డి, వెంకటరాముడు, నరసింహారెడ్డి రామచ్రందారెడ్డి, మద్దయ్య, వెంకటరాముడు, నాగేశ్, చెన్నయ్య పాల్గొన్నారు.

అహోబిలంలో శ్రీవారి గరుడోత్సవం



మాడ వీధుల్లో స్వామివారి ఊరేగింపు

ఆళ్లగడ్డ, జూలై 5(ఆంధ్రజ్యోతి): అహోబిలంలో శనివారం ఏకాదశి, స్వాతి నక్షత్రం పర్వదినం సందర్భంగా శ్రీవారి గరుడ వాహన సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తిని అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

‘పల్లె’ పచ్చదనమే ధ్యేయం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- భారీగా మొక్కలు తెప్పించిన బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె' పచ్చదనమే ధ్యేయమని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బీసీ ఇందిరమ్మ తన సొంత నిధులు రూ.30లక్షల వెచ్చించి ఐదువేల మొక్కలు, పూలకుండీలు కొనుగోలుచేసి హరిత బనగానపల్లె సంకల్పానికి శ్రీకారం చుట్టారు. బనగానపల్లె క్యాంపు కార్యాలయం నుంచి మంత్రి దంపతులు పట్టణంలో విద్యార్థులు, వివిధ శాఖల ఉద్యోగులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి కలెక్టరు రాజకుమారి మొక్కలు నాటారు. బనగానపల్లె రోడ్లు డివైడర్లపై విద్యార్థులతో కలిసి మంత్రి దంపతులు మొక్కలు నాటారు. పెట్రోల్‌బంకు కూడలిలో నిర్వహించిన సమావేశంలో మంత్రి బీసీ మాట్లాడుతూ బనగానపల్లెను పచ్చదనంతో నింపాలనే మహోన్నత లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నేడు నాటిన మొక్కలను సంరక్షించి చెట్లుగా పెంచాల్సిన బాధ్యత పట్టణ ప్రజలదే అన్నారు. గతంలో ప్లాస్టిక్ రహిత బనగానపల్లెగా తీర్చిదిద్దాలని బీసీ ఇందిరమ్మ పిలుపు మేరకు నేడు పట్టణంలో 80శాతం ప్లాస్టిక్ నిషేదం అమలులోకి వచ్చిందన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మంత్రి బీసీ దంపతులు, విద్యార్థులు

ప్రజల భాగస్వామ్యంతోనే విజయం : కలెక్టరు రాజకుమారి

బీసీ దంపతుల ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ప్రజల భాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమం అయినా విజయవంతం అవుతుందని కలెక్టర్ రాజకుమారి అన్నారు. ప్లాస్టిక్ రహిత బనగాన పల్లె నినాదంతో బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యం లో విజయవంతం కావడం హర్షించదగ్గ విషయమన్నారు.

ప్రజలందరికీ ధన్యవాదాలు: బీసీ ఇందిరమ్మ

పట్టణంలో పచ్చదనం కల్పించాలనే ధ్యేయంతోనే ఆరు నెలల క్రితం తలపెట్టిన ప్లాస్టిక్ రహిత బనగానపల్లెకు సహకరించిన ప్రజలందరికీ బీసీ ఇందిరమ్మ ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు పాఠశాలల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు వాడడం మానివేశారని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు చెప్పడం ఆనందం కలిగించిందన్నారు. ప్రస్తుతం హరిత బనగానపల్లెగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు.



కలెక్టర్ రాజకుమారికి మొక్కను అందిస్తున్న మంత్రి బీసీ



మొక్కలు నాటుతున్న మంత్రి బీసీ, ఇందిరమ్మ దంపతులు

వైభవంగా లాల్‌స్వామి పీరు ఊరేగింపు



రుద్రవరంలో పీర్లకు ఫతెహాలు చేస్తున్న భక్తులు



లాల్‌స్వామికి ఫతెహాలు చేస్తున్న భూమా జగత్ విఖ్యాతరెడ్డి

చాగలమర్రి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మొహర్రంలో భాగంగా చాగలమర్రి గ్రామంలోని చిన్నమకానం వీధిలో కొలువుదీరిన ప్రధాన పీరు లాల్‌స్వామిని శనివారం రాత్రి దివిటీల నడుమ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా ఊరేగింపు చేశారు. జనసందోహం మధ్య లాల్‌స్వామిని గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ఫతెహాలు సమర్పించారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి పర్యవేక్షణలో ఎస్‌ఐలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. లాల్‌స్వామి పీరుకు టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి ఫతెహాలు సమర్పించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రత్యేక ఫతెహాలు సమర్పించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

రుద్రవరం: మండలంలో శనివారం పీర్ల గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రుద్రవరం, కొండమాయపల్లె, నాగలవరం, నరసాపురం, చిత్తరేణిపల్లె, యల్లావత్తుల, చిన్నకంబలూరు, వెలగలపల్లె గ్రామాల్లో పీర్లకు భక్తులు ఫతెహాలు సమర్పించారు.

కోవెలకుంట్ల: పట్టణంలో కొలువుదీరిన పీర్ల వద్ద మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి ఫతెహాలు సమర్పించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

బనగానపల్లె: మండలంలో పెద్ద సరిగెత్తు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా పీర్ల చావిళ్ల వద్ద భక్తులు ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొండపేటలోని పెద్ద పీర్లచావిడి వద్ద భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

అభివృద్ధే మా నైజం

- బురద చల్లడం వైసీపీ నైజం
- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

రుద్రవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే మా నైజమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం సాయంత్రం సుపరిపాలన తొలి అడుగులో భాగంగా మండలంలోని చిలకలూరు గ్రామంలో రూ.13లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి మా నైజం, బురదచల్లడం వైసీపీ నైజం అంటూ విమర్శించారు. మళ్లీ జగన్ ప్రజల నెత్తిన చేయి పెట్టి ముద్దులు పెట్టి మోసం చేసేందుకు వస్తున్నారేమో.. తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆళ్లగడ్డ ప్రాంతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామన్నారు. తెలుగగంగ ప్రధాన కాల్వతో పాటు అన్ని కాల్వలకు నీరు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు రంగనాయకులు, ఎర్రం ప్రతాపరెడ్డి, ముళ్ల రాజ, చిన్నరాముడు, రామనాథరెడ్డి, చంద్రశేఖర్, బాలరాజు, మజ్జిగ వేణు, లక్ష్మికాంత్, చంద్ర, తహసీల్దారు మల్లికార్జునరావు, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఏవో సుమతి, పశువైద్యాధికారి మనోరంజన్‌ప్రతాప్, ఏఈలు, సుబ్రమణ్యం, కమాల్‌సాహెబ్, ఎంఈవో-2 లక్ష్మి పాల్గొన్నారు.



చిలకలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

కొలిమిగుండ్ల, జూలై 5, (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు నిబంధనలు తప్పక పాటించాలని ఎస్‌ఐ గోపాల్ తెలిపారు. శనివారం సాయంత్రం కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆటో డ్రైవర్లకు, వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ప్రతి ఒక్కరు డ్రైవర్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు.

గుండుపాపలలో వైద్య శిబిరం

దొర్నిపాడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండుపాపల గ్రామంలో శనివారం వైద్యాధికారి మహబూబ్‌సుభహాని ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలోని చిన్నారులకు బరువు, ఎత్తు పరీక్షించారు. సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది ప్రభావతి, పురుషోత్తమ్‌రెడ్డి, నాగశ్రావణి, ఆశా వర్కర్లు ఉన్నారు.

లక్ష్మీనరసింహుడి సన్నిధిలో ప్రముఖులు

ఆళ్లగడ్డ, జూలై 5(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహ స్వామిని శనివారం తెలంగాణ రాష్ట్ర హైడ్రా కమిషనర్ రంగనాథ్ సతీమణి లక్ష్మిలావణ్య, కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గూడురు సంజీవరాయుడు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలయ అభివృద్ధికి తమ వంతుగా సహకారం అందిస్తామని వారు అన్నారు.



స్వామిని దర్శించుకున్న హైడ్రా కమిషనర్ కుటుంబ సభ్యులు

రూ.30లక్షలతో కల్వర్టు నిర్మాణం

రుద్రవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్.కొత్తూరు గ్రామ సమీపంలో ఆర్ అండ్‌బీ రోడ్డు 'కల్వర్టు ప్రమాదకరం' అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల కథనం ప్రచురితమైంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. రూ.30లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టినట్లు శుక్రవారం ఏఈ మదనగోపాల్ తెలిపారు. నిబంధనల మేరకు కల్వర్టును నిర్మిస్తున్నామని ఏఈ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆర్.కొత్తూరు సమీపంలో నిర్మిస్తున్న కల్వర్టు

9న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

కోవెలకుంట్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీంబాషా, సీఐటీయూ జిల్లా నాయకులు సుధాకర్ కోరారు. శనివారం పట్టణంలోని స్థానిక కొండారెడ్డి స్మారక గ్రంథాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, కిరణ్, సుబ్బరాజు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కోవెలకుంట్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని ఆర్‌ఎస్‌పీ రాష్ట్ర కన్వీనరు ఓబులేసు కల్యాణ్, నంద్యాల జిల్లా కన్వీనరు సుబ్బరాయుడు కోరారు. శనివారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ముందు పేదలతో కలిసి ధర్నా చేశారు. కార్యక్రమంలో బనగానపల్లె కన్వీనరు అబ్రహాం, మహిళాసంఘం నాయకులు ఓబులమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): డెంగీ, మలేరియా వంటి సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు తస్లీమా సుల్తానా సూచించారు. శనివారం చెంచుగూడెంలో వైద్యసిబ్బంది ఆధ్వ ర్యం లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రుద్రవరం: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి బాబు అన్నారు. శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు.

సంక్రమిత వ్యాధుల నివారణపై అవగాహన

చాగలమర్రి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మూగజీవాల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పశుసం వర్ధకశాఖ ఏడీ వర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో సంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ ఎం శివలక్ష్మి, సీహెచ్‌వో రమణమ్మ, హెచ్‌ఈ విజయభారతి, పశువైద్య సిబ్బంది, షజి, మహబూబ్‌బాష, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీ వరప్రసాద్

అవుకు: కుక్కకాటు పట్ల నిర్లక్ష్యం తగదని పశువైద్యాధికారి డాక్టర్ భారతీదేవి అన్నారు. శనివారం అవుకు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుక్క కాటు నుంచి వ్యాపించే రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీధర్‌రావు, పశువైద్య సిబ్బంది రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మూసివేయ'బడి'ంది

రుద్రవరం, జూలై 5 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పందిళ్లపల్లె, తుమ్మలకొట్టాల గ్రామాల్లో రెండు పాఠశాలలు మూసి వేశారు. ఇందుకు సంబంధించి పాఠశాలలకు నోటీసులు అతికించినట్లు ఇన్‌చార్జి ఎంఈవో వీరరాఘవయ్య శనివారం తెలిపారు. ఈ రెండు గ్రామాల్లోని పాఠశాలలకు విద్యార్థులు రాకపోవడంతో మూసివేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా విద్యా శాఖాధికారికి నివేదిక పంపినట్లు ఆయన తెలిపారు.



పందిళ్లపల్లెలో మూతబడిన పాఠశాల

ఆరోగ్య ఉప కేంద్రానికి తాళం

రుద్రవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తలూరు గ్రామంలో శనివారం ఉప కేంద్రానికి తాళం తీయలేదు. వైద్యం కోసం వచ్చిన రోగులు వేచి చూసి తిరిగి వెళ్లారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

బనగానపల్లె, జూలై 5 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన పట్టణంలోని యూపీ పాఠశాల సమీపంలో శనివారం చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని తెలుగుపేటలో నివసించే గొల్లవినోద్ (34) యూపీ పాఠశాల సమీపంలోని బ్రిడ్జి వద్ద నిలిచి ఉండగా టిప్పర్ ఢీకొన్నది. దాంతో క్షతగాత్రుడిని బనగానపల్లె వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

'ప్రైవేట్'కు అప్పగించొద్దు

బనగానపల్లె, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆప్కాబ్‌ను రద్దు చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియమించాలనే ఆలోచనను విరమించాలని సీపీఎం నాయకుడు సుబ్బయ్య డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం కరపత్రాలు పంపిణీ చేసి నిరసన వ్యక్తం చేశారు. అప్కాబ్‌ను కొనసాగించాలని, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

పెంచిన చార్జీలు తగ్గించాలి

- ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట సీపీఐ ఆందోళన

డోన్ రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, పట్టన మండల కార్యదర్శులు మోటరాముడు, నారాయణలు హెచ్చరించారు. శనివారం ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ఆందోళనలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ అను బంధ సంఘాల నాయకులు ప్రభాకర్, రణత్ పాల్గొన్నారు.

ప్యాపిలి: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు, కార్యకర్తలు విద్యుత్ చార్జీల పెంపునకు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏఈ వినయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జింక మృతి

రుద్రవరం , జూలై 5 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఫారెస్ట్ రేంజ్‌లోని బత్తులూరు సమీపంలో శనివారం జింక మృతి చెందినట్లు సంబంధిత శాఖ అధికారులు శనివారం తెలిపారు. జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకొని కార్యాలయానికి తరలించినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- గ్రామాల్లో 'తొలి అడుగు'

సంజామల, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పేరుసోమలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి బీసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అనంతరం గ్రామంలో రూ. 50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు రూ. 34లక్షలతో ఏర్పాటైన కల్వర్టును మంత్రి ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ 2014లో తాను ఎమ్మెల్యేగా గ్రామంలో చేసిన అభివృద్ధే తప్ప వైసీపీ నాయకులు చేసింది ఏమీ లేదన్నారు. పేరుసోమల గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తామన్నారు. బీసీ కాలనీలో సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ. 20లక్షల నిధులను విడుదల చేస్తున్నామని హామీ ఇచ్చారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు మంచాల మద్దిలేటి రెడ్డి, బెలుం సురేష్ రెడ్డి, శీలా వెంకటేశ్వర్లు, రామిరెడ్డిపల్లె సర్పంచ్ వీర ప్రతాప్ రెడ్డి, శంకర్ రెడ్డి, చిన్న శేఖర్ రెడ్డి నాగిరెడ్డి, చంద్రశేఖర్‌రావు, శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షులు బత్తుల వెంకట ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్కి హుసేన్, మద్దిలేటి, సుబ్బారావు, మాధవ, పెద్ద సుబ్బారెడ్డి, భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగలమర్రి: రాష్ట్రంలో టీడీపీతోనే సుపరిపాలన సాధ్యమని నంద్యాల పార్లమెంట్ స్పోక్‌పర్సన్ సల్లా నాగరాజు తెలిపారు. శనివారం చాగలమర్రి 217 బూత్ పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, వలి, టైలర్‌బాష, చోటు, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల: టీడీపీతోనే పేదలకు సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని వివిధ వార్డుల్లో పర్యటించి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో యువ నాయకులు గడ్డం అమర్‌నాథరెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ నాయకులు పెద్ద చెంద్రాయుడు అన్నారు. శనివారం హరివరం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూత్ కోకన్వీనరు పెద్ద చెన్నుడు, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, నరేశ్, నారాయణరెడ్డి, సత్యరాజ్ తదితరులున్నారు.

ప్యాపిలి: చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని రాంపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాంపురం నాగేశ్వరరావు, రమేష్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఏనుగమర్రి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు మోపూరి రాము, సూర్యనారాయణగౌడు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



హరివరంలో తొలి అడుగు కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



కోవెలకుంట్లలో టీడీపీ నాయకుల ప్రచారం



ప్యాపిలి మండలంలో..